# భలే బామ్మ

-సత్యవాడ సోదరిమణులు

భార్యకు ఇష్టమని పావుకిలో బాదాం హల్వా, మూర మల్లెపువ్వులు కొనుక్కుని హుషారుగా ఇంటికొచ్చిన పూర్ణచందర్ ఇల్లాలి వాలకం చూస్తూనే నీరుకారిపోయాడు.

"అదేమిటోయ్... అలా ఉన్నావు? నేను ఆఫీసునుంచి వచ్చేసరికి కాఫీ టిఫిన్‌తో ఆహ్వానించేదానివి. ఇలా సోఫాలో కూలబడి ఈ అవతారం ఏమిటి?"

"ఇహ ఇంతే. ఈ రోజుతో మన సరదాలకు, సరసాలకు స్వస్తి"

"ఇక నన్ను సస్పెన్స్‌లో పెట్టక విషయం చెప్పేద్దూ"

అర్ధాంగి ఎందుకలా అప్‌సెట్ అయిందో వివరించేసరికి అతగాడూ హతోస్మీ అనుకున్నాడు. ఏద విపత్తు ముంచుకొస్తున్నట్లు ఆ యువ జంట ఆవేదన పడిపోవడానికి కారణం అతగాడి బామ్మ. పెళ్లయి ఐదేళ్లు దాటినా కొత్త దంపతుల్లా హత్తుకుపోయి అతుక్కుపోయి హాయిగా సంసారం సాగిస్తున్న వాళ్ల మధ్యకి ఆవిడగారు రాబోతోంది. పూర్ణచందర్ అంటే పుట్టెడు ప్రేమ అతని బామ్మకు. అతనికి మాత్రం బామ్మంటే గౌరవాభిమానాలు లేవనా? ఎటొచ్చీ ఆవిడ మడి ఆచారం అంటేనే మంట.

"కాలంతోపాటు మనమూ మారాలే" అని చుట్టుపక్కలవాళ్లు చెవిలో ఇల్లు కట్టుకుని పోరినా ఆ విషయంలో బామ్మ చెవిటిదే. ఆవిడ ఏ ఇంట్లో ఉంటే ఆ ఇంట్లో తన మాటే చెల్లుబాటు కావాలి. అందరూ తన చెప్పుచేతల్లోనే నడుచుకోవాలి. వణికించే చలిలోనైనా గజగజలాడుతూ చన్నీటి స్నానం చేయాల్సిందే.

'ఎంతసేపు టీవీ ముందు కూర్చుంటారు? అసలా పాడు బొమ్మలు చూసే పాడైపోతున్నారు జనాలు...కట్టేయండి" అంటూ ఠక్కున ఆవిడే ఆపేస్తుంది. ఆవిడ వండే చప్పిడి కూడు తినాలి తప్ప నచ్చిన వంటకాలు చేసుకుని తిననివ్వరు. ఇంటికన్నా గుడి పదిలం అని ఫైవ్‌స్టార్ హోటల్‌కో పోదామంటే అదీ పడనివ్వదు. ఇంట్లో ఉన్నవారంతా ఒకేసారి భోజనం చేయాలి, ఒకే టైమ్‌కి నిద్రపోవాలి, ఒకే టైమ్‌లో మేల్కొనాలి... అన్నీ ఇన్ని ఆంక్షలా? అవన్నీ తలచుకుంటేనే మరీ హడలిపోతున్నారిద్దరూ.

"బామ్మ ప్రయాణం ఎలా అయినా ఆపేయాలి. ఏదో ఉపాయం నువ్వే చెప్పు"

"మీ నాన్న 'మా అమ్మని మీ దగ్గర ఉంచుకోండి. నన్నూ మీ అత్తయ్యని మీ ఆడబడుచూ అమెరికా రమ్మంది. హాయిగా దాని కాపురం చూసొస్తాం" అంటూ ఫోన్లో రొద పెట్టిన క్షణం నుంచీ నేను తల పగులగొట్టుకుని ఆలోచిస్తున్నానండీ. ఈసారి మీ బామ్మ రాక తప్పించుకోలేము" పూజ.

"అంతేనంటావా?"

"అంతేగాక మరెంత? మన పెళ్లయినప్పటి నుంచీ ఏదో సాకు చెప్తూ వచ్చాము. ఇక చేసేదేముంది అనుభవించడంతప్ప"

"డోంట్ వర్రీ పూజా. ఈ పూర్ణచందర్ అలా జరగనివ్వడు. ఏదో ప్లాన్ వేసి బామ్మ రాకను ఆపేస్తాడు. నీ భర్త అనే ఈ ధీరుడు అమ్మానాన్నల దగ్గరికి బయల్దేరతాడు. వాళ్ల అమెరికా ప్రయాణం ఆపేస్తాడు. బామ్మ ప్రయాణం లేదు పెంకులు లేదు."

★★★

కొడుకును చూస్తూనే అదిరిపడ్డారా దంపతులు.

"అబ్బాయి అత్తగారిని తీసుకెళ్లడానికి వచ్చాడండీ. మనం ఫోనులో పోరు పెట్టేసాము. దిగబడ్డాడు" చెవులు కొరుక్కున్నారిద్దరూ.

పరస్పరం యోగక్షేమాలు, కాఫీ ఫలహారాలు ముగిసాక "మా ట్రిప్ క్యాన్సిల్ చేసుకుంటున్నాం. అమ్మ నీతో రాదురా" తండ్రి నోట ఆ చల్లని మాట వినగానే 'కాగల కార్యం గంధర్వులు తీర్చారు' అని మురిసిపోయాడు. కానీ అసలు రహస్యం తనకు తెలిసేసరికి బామ్మను తనే తీసుకెళ్లితీరాలని పట్టుబట్టాడు. అమ్మానాన్నా తన దగ్గరకు రాకపోతే తనిక ఇండియాకు రానేరానని అక్క ఫోనులో స్పష్టం చేసింది. అది తన నిర్వాకమే.

కూతురి మాట కాదనలేక అమ్మానాన్నలు ఫ్లైట్ ఎక్కారు.

బామ్మను వాటేసుకుని మరీ తను ట్రైన్ ఎక్కాడు పూర్ణచందర్.

★★★

భర్తతోసహా బామ్మ ప్రత్యక్షమయ్యేసరికి పట్టరాని కోపమొచ్చింది పూజకు.

"అన్నీ ఇన్నీ డంబాలు పలికారా అయ్యగారు... అత్తమామల ముందు తలొంచుకుని హాయిగా వాళ్లని అమెరికా పంపించి ఎంచక్కా ఓడిపోయి మీరు బామ్మను వెంటేసుకొచ్చారు"

"నీ మొగుడేం అంత తెలివితక్కువ వాడు కాదోయ్. అమ్మాయి దగ్గర ససేమిరా వెళ్లమన్నా నీ అత్తమామల్ని తికమకపెట్టేసి ఆకాశ మార్గం పట్టించి బామ్మని ప్రేమగా గుండెల్లో పొదుగుకుని రావడానికి ఓ రహస్యం ఉంది" అంటూ భార్య చెవిలో ఊదాడు.

అంతే...పూజా, పూర్ణాలు బామ్మని పువ్వుల్లో పెట్టి చూసుకోవడం మొదలుపెట్టారు.

"ఒరేయ్ పూర్ణాలూ నేనున్నానని మీ అల

వాట్లేం మార్చుకోకండి. పొద్దున్నే బ్యాడ్ కాఫీ తాగండి''

ఇద్దరికీ నవ్వాగలేదు.

"బ్యాడ్ కాఫీ కాదు బామ్మా బెడ్ కాఫీ. అయినా మనం ముగ్గురం కలిసే కాఫీ తాగుతాం. మేమూ నీ దగ్గరే పడుకుంటాం. నిన్నొదిలి ఒక్కక్షణం ఉండం'' బామ్మ మెడ చుట్టూ చేయి వేసి గారాలు పోయాడు పూర్ణచందర్.

"అవును అమ్మమ్మగారూ... నేనే మడిగా మీక్కావాల్సినవన్నీ వండి పెడతాను. ఏం తినాలనిపిస్తోందో చెప్పండి'' ఆవిడ మెడలో కాసులపేరు సవిరిస్తూ అంది పూజ.

వాళ్లు చూపించే అభిమానమంతా ఎందుకో తెలిసిన బామ్మ ముసిముసిగా నవ్వుకుంది.

"పిచ్చిపిల్లల్లారా! నాకోసమేం శ్రమ పడవద్దు. నావల్ల మీ ముద్దుముచ్చట్లు ఎందుకు కాదనుకుంటారు. చిన్నపిల్లలు మీరు సరదాగా, సంతో



షంగా ఎక్కడికైనా తిరిగిరండి. ఒక్కదాన్నీ ఇంట్లో ఉన్నా నాకేం బాధలేదు. ఏ భగవద్గీతో, రామయణమో పారాయణ చేసుకుంటే బోలెడంత కాలక్షేపం.''

"అది కాదులే బామ్మా... ఇన్నాళ్లకి మా ఇంటికొచ్చావు. నిన్ను కళ్లల్లో పెట్టి చూసుకోవాలి. నువ్వే మా ప్రాణం'' అంటూ పూజ, పూర్ణలు బామ్మని కాసేపైనా వంటరిగా ఉండనివ్వడంలేదు.

"పూర్ణాలూ...'' అని సాగదీస్తూ తన భర్తని పిలుస్తుంటే పూజకి ఎక్కడ లేని చిరాకు పుట్టుకొస్తుంది.

"పూర్ణాలు, బొబ్బట్లు ఏంటి అమ్మమ్మగారు... చంద్రం అని పిలవండి'' అని గట్టిగా వార్నింగ్ ఇవ్వాలనిపించినా ఆ రహస్యం గుర్తుకొచ్చి తమాయించుకుంటోంది. బామ్మనల్లుకుని పూజ పడుకోవడం తను రాత్రులు విడిగా ఒక మంచంమీద ఈ పరిస్థితి చూడ్డానికి విసుగు తెప్పిస్తోంది. అతనూ, కాదు కూడదు అనకపోవడానికి అదే కారణం. ఏదేమైతేనేం బామ్మ మాత్రం బాగా సుఖపడుతోంది.



## గుర్రాలంటే ఇష్టం

నమితకి గుర్రాలంటే భలే అభిమానమట. అందుకనే ఆమె తన సంపాదనలో కొంత వాటికోసం ఖర్చుపెడుతోంది. ఎలాగంటారా? ఇప్పటికి ఆమె పది గుర్రాల్ని కొని వాటికి తగిన సంరక్షణ ఏర్పాట్లు చేసిందిట. ఇవి ఆమె సొంత వూరు సూరత్‌లో వున్నాయి. ఆమె తల్లిదండ్రులు వాటి ఆలనాపాలనా పర్యవేక్షిస్తారట. మధ్యమధ్యలో నమిత కూడా వెళ్లి చూసొస్తుంటుందిట. త్వరలోనే రేసు గుర్రాల్ని కూడా కొని వాటినీ పెంచే వుద్దేశంలో వుందిట నమిత.




అటు మనవరాలి కోరిక తీర్చి కొడుకూ కోడల్ని అమెరికా పంపగలిగింది. ఇటు కళ్లనిండుగా పూజ, పూర్ణాల్ని చూసుకుంటూ తృప్తిని పొందుతోంది.

"ఏమిటండీ మీ బామ్మ! ఓ జ్వరం లేదూ, కనీసం ముక్కు చీదరు. కడుపు్పట్టుకుని కూర్చోరు, తలనొప్పి, కాళ్లనొప్పులని కనీసం అమృతాంజనం అయినా రుద్దించుకోరు. నిక్షేపంలా తిరిగేస్తోంది. చూస్తుంటే మీరు నాకు కట్టుకథలు చెప్పేరులా వుంది. అలా నన్ను ఊరించేస్తే మీ బామ్మకి అర్థమైన సేవలు నాచేత చేయించవచ్చని మీ ఎత్తుగడ కదూ'' అంటూ మొగుడ్ని దులిపేసింది.

"చిట్టితల్లీ! ఒట్టేసి చెబుతున్నా. లోగుట్టు పెరుమాళ్లకెరుక. నువ్వు ముక్కు చీదడం, నన్ను బనాయించడం అన్యాయం. నాకు తెలిసిన నిజమయితే ఇది. ఈసరికల్లా బామ్మ మంచం పట్టేయాలి. ముసలితనపు ఛాయలు కూడా తగ్గి నవనవలాడిపోతోంది. మన సేవతో ఆ మహాతల్లి వయస్సు పాతికేళ్లు వెనక్కెళ్లిపోయినట్లుంది. ఇదేం మాయో నాకు అంతు పట్టడంలేదు పూజా''

మినపట్లు అల్లంచెట్నీతో హాయిగా ఆరగించి మరచెంబులాంటి గ్లాసుతో మనవడు అందించిన బూస్ట్ గటగటా తాగేసి నిద్ర నటిస్తున్న హరమ్మగారు ఇలాంటి సంభాషణ తను ఏ రోజు వింటుందా అని ఎదురు చూస్తూనే వుంది.

'మాయ కాదురా. మంత్రం... నారాయణ మంత్రం' తను పన్నిన యుక్తి తనే నెమరు వేసుకోసాగింది.

"పనికిమాలినవాళ్లకే పూర్ణాయుర్దాయం ఇస్తాడు భగవంతుడు. నేను యాభైయోపడిలో పడినా అత్త మహాతల్లికి అడ్డమైన చాకిరీ చేయడంతోనే బ్రతుకు తెల్లారిపోతోంది. అమ్మాయి రెండు పురుళ్లు అమెరికాలోనే పోసుకున్నా వెళ్లి దానికి తోడుగా ఉండే అదృష్టం నాకెక్కడిది? హాయిగా అత్తమామల పోరు వదిలించేసుకుంది కనుక వియ్యపురాలే వెళ్లగలిగింది'' అని కోడలు పదే పదే విసుక్కుంటుంటే తన ఉనికి తనకే భారమనిపించింది. తన బాధ ఎవరికి చెప్పుకోవాలి?

'ఆవిడకేం గుండ్రాయిలా ఉంది' అంటున్నా వినిపించుకోకుండా 'వయస్సు పైబడ్డాక వారానికోసారైనా కోడల్ని ఒప్పించి తన కారులోనే హాస్పిటల్‌కు తీసుకువెళ్లి ఆవిడ ఆరోగ్యాన్ని పదిలంగా చూస్తూ వస్తున్న కన్నకొడుకు కన్న మిన్న అనిపించే డాక్టర్ నారాయణ మెదిలాడు మనసులో.

తన ఆవేదన అంతా నారాయణతో వెళ్లబోసుకుంది. అతగాడు ఆడిస్తున్న నాటకమే ఇదంతా.

"ఆరునెలలు కాదుకదా ఆరేళ్లు దాటినా ఆరోగ్యంగానే ఉంటావమ్మా. అయితే మనం అలా చెబితే కానీ వాళ్లందరి వీళ్లందరి రోగం కుదర్చలేము. నువ్వొక్క మాట 'నేను పోయేటప్పుడు నా కళ్లముందు ఉండి నా చెవిలో రామనామ స్మరణ చేస్తూ తులసి తీర్థం గొంతులో ఎవరో పోస్తారో వాళ్లకే నేను దాచి ఉంచిన ఐదులక్షలు, వంటిమీద నగలు దక్కుతాయి' అనేయ్ చాలు. మిగతా కథ నేను నడిపిస్తాను. ఆ వేడుక చూద్దువుగాని. నీ పక్కనే నేనుంటానుగా. ఇంక దీని గురించి ఏమీ ఆలోచించకు''

ఆ రాత్రే తనని ఏవేవో రోగాలు చుట్టుముట్టేసినట్లు అభినయించింది. కొడుకు కోడల్ని దగ్గరకు తీసుకుని నారాయణ బట్టీ పట్టించిన పాఠం ఒప్పజెప్పేసింది.

ఇంక చూడాలి కోడలి పిల్లకి తనంటే ఎక్కడలేని ఆపేక్ష. కొడుకు మహాశయుడైతే కాళ్లు నొక్కుతూ తల పడుతూ తన మంచం దగ్గరే మకాం.

ఇదేం ఎగరనివాడిలా 'హఠాత్తుగా అమ్మను చూడాలనిపించింది' అంటూ నారాయణ ప్రత్యక్షం. ఇంకేం నాటకం బాగా రక్తి కట్టింది. కల్లబొల్లి ఏడుపులు ప్రారంభం.

'ఇక ఈవిడ ఆరునెలలకంటే బ్రతకదు' చాటుగా తీసుకెళ్లి చెప్పాడేమో... ఆ శుభవార్త అశుభవార్తలా అభినయించే పనిలో పడ్డారు. దాని పర్యవసానమే అమెరికా ప్రయాణం ఆపేసుకోవడం.

'నేను చచ్చినా బామ్మను తీసుకెళ్లనని' చెప్పిన పూర్ణాలుగాడు, ఈ నారాయణ పక్కకు పిలిచి సంగతి చెవిలో వేసేసరికి పొంగిపోతూ 'బామ్మను నా దగ్గరే వుంచుకుంటాను' అని పట్టుబట్టాడు.

పాపం నారాయణ ఆడించిన నాటకం మహా బాగా రక్తికట్టింది. తన ప్రాణాలు గాలిలో కలసిపోతాయని, డబ్బు నగలు తమకే దక్కాలని ఈ కుర్రకుంకలకెంత తాపత్రయం? వాళ్లు మాత్రం తక్కువ తిన్నారా? అమెరికా వెళ్లేరేగానీ మనసుల్లక్కడ లేవు. అల్లుడ్ని హైరానా పెట్టేసి తిరుగు ప్రయాణం కట్టేసారు.

తనలో తనే పిచ్చిగా నవ్వుకుంటున్న బామ్మను చూసి 'మతి చలించి టపా కట్టేస్తుందేమో' అని ఆశగా అనుకున్నారు.

"అదేమిటమ్మగారూ... అలా నవ్వుకుంటుంటే మీకు పిచ్చి పట్టిందనుకోరు ఎవరైనా?"

"పోనీయ్... అలాగే అనుకోనీ" తన చుట్టూ చేయి వేసి అంటున్న తన మనవరాలికి సమాధానమిచ్చింది.

నేల చూపులు చూస్తూ మౌనంగా ఉండిపోయింది మనవరాలు.

***

తనను తీసుకెళ్లడానికి వచ్చిన కొడుకుని కోడల్ని, తనని పంపనే పంమని పట్టుపట్టుక్కూర్చున్న పూజా పూర్ణాలని దగ్గరకు పిలిచింది. ముందుగా అనుకున్న ప్రకారం నారాయణ కూడా వచ్చాడు. అందర్నీ చుట్టూ కూర్చోబెట్టుకుని హరమ్మ నోరు విప్పింది...కాదు కాదు మనసు విప్పింది.

"ఈ ముసలిదింకా బ్రతికుండడం మీ అందరికీ కంటగింపుగానే ఉంది అనిపిస్తోంది మీ ప్రవర్తన చూస్తుంటే. అది నా భ్రమా? నిజమేనా? ఋజువు చేసుకుందామని..." హరమ్మ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. గొంతు పూడుకుపోయింది.

"మీరేం మాట్లాడకండి హరమ్మగారూ...వీళ్ల మాటల గురించి కూడా మీరేమీ పట్టించుకోకండి. మిగిలింది నేను చెబుతా" ఆవిడ కళ్లు సుతారంగా తుడిచి నారాయణ అందుకున్నాడు.

"మీ ఇంటి పెద్దదిక్కు ఇక ఆరునెలలే ప్రాణాలతో వుంటుందని నాటకం ఆడించింది నేనే. మీ నలుగురి మనస్తత్వాలు బయటపడ్డాయి. ఆవిడ డబ్బు మీదైతే వ్యామోహం ఉంది కానీ అణుమాత్రం ఆపేక్ష ఈ పెద్దావిడ మీదలేదని తేలిపోయింది. 'అత్తగారి చాకిరీతో సతమతమైపోతున్నావని తెగ ఇదైపోయావ్. బామ్మ తమ ఇంటకే రాకూడదనుకున్నారు ఈ ప్రబుద్ధులు. తీరా డబ్బు ఎర వేసేసరికి పాపం... ఈవిడమీద ఎక్కడలేని అభిమానం కురిపించేసారు."

"పోనీలే నాయనా... నావాళ్ల తత్వాలు ఎలా వుంటేనేం? నా నిర్ణయం ఏదో వీళ్ల చెవిన పడేస్తాను"

"ఏం నిర్ణయించుకున్నావు?" ఆ నాలుగు గొంతులూ ఒకేసారి ప్రశ్నించాయి.

హరమ్మ బోసి నోరంతా తెరిచి నిండుగా నవ్వింది.

"మాబోటి పెద్దలపట్ల ఈ మోస్తరు భావాలున్నది మీకే కాదర్రా.. సమాజమంతా ఇలాగే ఏడుస్తోంది. లేకపోతే ఈరోజుల్లో ఇన్నిన్ని వృద్ధాశ్రమాలు వెలిసేనా?"

"ఇంతకీ మీరు ఆశ్రమంలో చేరతానంటారా? ఇంతకాలం నేను చేసినదానికి మీ దృష్టిలో అసలు ఎలాటి విలువలేదన్నమాట" కోడలు ఒంటికాలిపై లేచింది.

"ఆవిడతో మాటలేమిటి? ఇంతకాలం కన్నతల్లిని కళ్లల్లో పెట్టుకుని చూసినా నా పరువే ఎలాంటి మొహమాటం లేకుండా బజారున పడేస్తోంది" రుసరుసలాడాడు పుత్రరత్నం.

"మీరెన్నను కున్నా ఆవిడ అభిప్రాయమంతే. వార్ధక్యం పైన పడగానే నిర్లక్ష్యానికి గురవుతున్న తనబోటి వాళ్లకోసమే ఆమె ఆస్తిపాస్తులు వినియోగించాలనుకోవడం తప్పనలేంకదా. ఆవిడ ఇష్ట ప్రకారమే జరగనివ్వండి" ఇంక ఎవరికీ మాట్లాడే పని లేదన్నట్లుగా ముక్తాయింపు పలికాడు నారాయణ.

☆

## మరోసారి టైటానిక్ యాత్ర

1912లో టైటానిక్ ఓడ సముద్రంలోని మంచుకొండని ఢీకొని వందలాది ప్రయాణికులు సముద్ర సమాధి అయిన సంగతి తెలిసిందే. ఆ సంఘటన జరిగి 14-4-2012 నాటికి వంద సంవత్సరాలు కానున్న సందర్భంగా సరిగ్గా అలాంటి ఓడనే తయారుచేసి సరిగ్గా అంతేమంది (1309) ప్రయాణికులతో తిరిగి సౌతాంప్టన్ రేవు నుంచి మొదటి టైటానిక్ ప్రయాణించిన దారిలో యాత్ర జరపడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయిట. ఆనాటి ఓడలో ఏ ఏ భోజన పదార్థాలు తయారు చేసారో, ఎలాంటి సంగీతం వినిపించారో, ఎలాంటి నృత్యాలు జరిగాయో మొత్తం చరిత్ర పునరావృతమయ్యేలా చేయనున్నారు. సరిగ్గా మంచుకొండని ఢీకొని ఓడ ముక్కలయిన చోట 15-4-2012 తెల్లవారుఝామున 2.20 గంటలకు ఈ ఓడను ఆపి అక్కడ ప్రత్యేక కార్యక్రమాన్ని జరుపుతారుట. చివరికి న్యూయార్క్‌కు చేరుకున్నాక హేలిఫేక్స్ దగ్గర సమాధి చేయబడిన 121 మంది ఆనాటి ప్రయాణికులకు శ్రద్ధాంజలి ఘటిస్తారుట. ఈ యాత్రలో ప్రయాణించడానికి అప్పుడే అడ్వాన్స్ బుకింగ్‌లు మొదలయ్యాయిట.

## మంటల్లో నడిచిన బౌద్ధ సన్యాసి

ఆ మధ్య జపాన్‌లోని నగాటోరాలో ఫైర్ ఫెస్టివల్ జరిగినప్పుడు ఒక బౌద్ధ సన్యాసి మంటల్లో నడిచి అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేసాడు.

-తటవర్తి

